# పరిహారం

వింధ్యవాసిని




వేణు అంటే మా ఆఫీస్‌లో ఇష్టం లేని వాళ్ళెవరూ ఉండరేమో! ఎప్పుడూ చిరునవ్వు పెదవులమీద చెరగకుండా అందరినీ పలుకరిస్తూ, అందరికీ సర్వీస్ చేసే వేణుకి తన చనువును, ప్రవర్తనను, హద్దుల్లో ఉంచుకోవటం కూడా తెలుసు. అందరికీ అతనిమీదున్న అభిమానంవల్ల, నాకతనంటే ఉన్న ప్రత్యేకమయిన ఫీలింగ్స్‌కి ఎవరూ కారణాలు వెతుకుతున్నట్లు కనిపించదు.

మాదొక చిన్న ఆటోమొబైల్ ఆక్సెసరీస్ సేల్స్ అండ్ సర్వీసింగ్ ఆఫీస్. నేనీ కంపెనీలో చేరి మూడేళ్ళయింది. అప్పట్నుంచీ ఈ బ్రాంచ్‌లోనే మేనేజర్‌గా పనిచేస్తున్నాను. ఇక్కడ ఆడా, మగా అంతా కలిసి ముప్పయిమంది ఉద్యోగులు పనిచేస్తారు. నలుగురు సూపర్‌వైజర్లు, ఒక ఆఫీస్ ఎడ్మినిస్ట్రేటర్ కమ్ ఎకౌంటెంట్, మిగతా అంతా క్లర్కులు.

ఇక్కడికి నేనొచ్చి చేరిన కొత్తలో, వేణు ఇక్కడ చేరాడు. మొదట్లో తను పనిచేసే నాయర్ తరఫున మాకందరికీ రోజూ రెండుసార్లు కాఫీ తెచ్చి అందించేవాడు. మెల్లగా, అతని మంచితనం, స్నేహభావం ఇక్కడ అందరి మనసులనూ గెలుచుకున్నాయి. ఎకౌంటెంట్‌తో మొదలుపెట్టి, కొందరు క్లర్కులు కూడా రికమెండ్ చేయటంతో, వేణును మా ఆఫీస్‌లో ఒక బాయ్‌గా చేర్చుకుని, నా మనసులో చిన్న కోరికను కూడా తీర్చుకోవడమేం కష్టం కాలేదు.

వేణు నా చిన్నప్పటి మాస్టరుగారు, మా తండ్రికి చాలా ఆప్తమిత్రులు అయిన, రామానుజంగారి ఏకైక పుత్రుడని నేను మొదటే కనుక్కున్నాను. అతనికీ నేనెవరో తెలిసుండాలని అనుకుంటాను. కానీ ఆ విషయం మామధ్య ఎప్పుడూ రాదు. ఆఫీస్‌లో, నేను మేనేజర్ రామకృష్ణరాజు. అతడు బాయ్ వేణుగోపాల్. అంతే! నేనే ఆఫీస్‌కంతా బాస్ అయినా, ఆఫీస్ స్టాఫ్‌తో ఇంట్లో పనిచేయించుకునే అలవాటు నాకు లేదు. అందువల్ల వేణును ఇంకెక్కడా కలిసే అవకాశం లేదు.

ఇవాళ మాలో కొంతమందిమి, ఒక వాన్ మాట్లాడుకుని, వేణూ వాళ్ళ ఊరు కర్నూలుకు అతని అక్కయ్య పెళ్ళికి వెళుతున్నాం.

వేణు గతమాసం ఒకరోజు నా కేబిన్లోకి వచ్చి మాట్లాడకుండా, చేతులు నులుముకుంటూ నిలుచున్నాడు. నేనే అడిగాను. "ఏంటి, వేణూ ఏమయినా కావాలా? మీ ఇంట్లో అందరూ కులాసానా?"

"మా అక్కయ్య పెళ్ళి కుదిరింది సార్! పెళ్ళి ఖర్చుకు కాస్త డబ్బు కావాలి. నిదానంగా నా జీతంలోంచి పట్టుకొమ్మని, మీరు రికమెండ్ చేస్తే...."

అతడితో ఈ విషయాలెప్పుడూ నేను మాట్లాడకపోయినా, అతనికి ఇంట్లో పక్షవాతం వచ్చిన తండ్రీ, వయసయిన తండ్రీ, పెళ్ళికాని అక్క, స్కూలుకెళ్ళే చెల్లెలు ఉన్నారని తెలుసు. వాళ్ళందరి బాధ్యత ఇతనిమీదే ఉంది. కుతూహలంగా అడిగాను.

"ఏ ఊరి సంబంధం వేణూ? అబ్బాయేం చేస్తాడు?"

వేణు ఫక్కుమని నవ్వాడు.

"మా అక్కయ్యకి ముప్పయిపైనే వయసు సార్. ఇంకా నయం సన్నగా ఉన్నందుకు వయసు కనిపించదు. పెళ్ళికాని అబ్బాయిలు ఎక్కడ దొరుకుతారీ వయసులో. మా బంధువుల్లోనే ఒకాయన, రెండో పెళ్ళివాడు దొరికాడు. భార్య చనిపోయి మూడేళ్ళయింది. కట్నం ఖర్చు లేదు. కాస్త ఆస్తి, అనుకూలం ఉన్నవాళ్ళే. అందుకని ఫర్వాలేదు. మా అక్క సుఖపడుతుంది అంటుంది మా అమ్మ! ఏంటో, నేనివన్నీ పట్టించుకోవటం మానేసాను. అక్కయ్యకెలాగయినా, మా అమ్మ, నాన్న బతికుండగానే పెళ్ళిచేయాలని అనుకున్నాను. అంతకన్నా కొడుకుగా నేనేం చెయ్యగలను సార్!" అని అడుగుతున్న వేణును చూస్తుంటే, పదేళ్ళక్రితం మా మాథ్స్ మేస్టారు, రామానుజంగారి ఇంటి పరిస్థితి గుర్తొచ్చి, గుండె కలుక్కుమంది.

అప్పటికి వేణుకు పదిహేనేళ్ళుంటాయేమో! మేష్టర్ రామానుజంగారు స్కూలు, ఇంట్లో ట్యూషన్లతో తీరుబాటులేకుండా ఉండేవారు. మాస్టారికి లెక్కలు బాగా చెప్తారని స్కూల్లో మంచిపేరు. పిల్లలకూ, తల్లిదండ్రులకూ సమానంగా ఇష్టమయిన టీచర్ ఆయన. స్కూల్లో బాగానే మార్కులువచ్చే పిల్లలం కూడా ఆయనింటికి ట్యూషన్‌కు వెళ్ళటం ఇష్టపడేవాళ్ళం.

ఆయన మొదటి సంతానం కూతురు, ఉమ అంటే, ఆ ఇంట్లో బాగా ముద్దు. తనూ అంతే. కాస్త పొగరుగా, నాకేంటి అడ్డు అన్నట్లు ఉండేది. చూడటానికి చక్కగా కూడా ఉండే ఉమకు, ఇంటర్మీడియట్ పాసయ్యేసరికి పెళ్ళిసంబంధం కుదిరింది.

ఉమంటే నాకంతగా పడేదికాదు. దానికితోడు, ఆమె, ఆమెపెళ్ళి నాకు, నా చదువుకు సంబంధించిన ప్లాన్లకూ అడ్డం వచ్చినట్లయింది. మా నాన్నగారి పుణ్యమా అని.

ఆయన నన్ను అమెరికాలో ఎమ్.ఎస్ చేయడానికి పంపించాలని ఫ్లైట్ టికెట్‌కూ, ఖర్చులకూ ఉంచుకున్న మూడులక్షలూ ఉమ పెళ్ళి ఖర్చులకు, మేష్టర్‌గారికి అప్పుగా ఇవ్వాలని అనుకున్నారు. నన్నెలాగూ డిగ్రీ అయిపోయింది కదా, ఉద్యోగంలో చేరిపో అన్నారు. నాకు మాత్రం చాలా కోపం వచ్చింది.

తర్వాత, ఉమ పెళ్ళి తప్పిపోయింది. ఎవరో అనామకంగా, ఉమ గురించి అబ్బాయివైపు వారికి చెడ్డగా వ్రాసారని, వాళ్ళు మనసు విరిగి ఈ సంబంధం వద్దనుకున్నారని పుకారు!

నాకు ఏ అమెరికన్ యూనివర్సిటీలోనూ సీటు మాత్రం రాలేదు.

ఉమ పెళ్ళి తప్పగానే, రామానుజం మేష్టర్‌గారికి షాక్ తగిలి, పక్షవాతం వచ్చింది. కొడుకు వేణు కూడా అదే టైంలో, ఇంట్లోంచి డబ్బు తీసుకుని, ఎటో పోడాయని తెలిసింది. అతను మళ్ళీ ఎప్పుడు తిరిగొచ్చాడో నాకయితే తెలీదు.


వ్యాపారం పనిమీద హైదరాబాదుకు వెళ్ళివస్తున్న మా నాన్నగారు, తమ్ముడు, బస్ ఏక్సిడెంట్ అయి, అక్కడికక్కడే పోయారు. నేను మా అమ్మను తీసుకుని, హైదరాబాదుకు ఆవిడ మకాం మార్పించేసాను. అప్పట్నించీ మాకు మేష్టర్‌గారి కుటుంబంతో సంబంధాలు తెగిపోయినట్లే. మళ్ళీ, వేణును మా ఆఫీస్‌లో చేర్చుకునే ముందు ఆఫీసులో, అతని హితాభిలాషులంతా కలిసి తయారుచేసిన బయోడేటాలో చూసాను. రామానుజం అనే పేరు. ఇంటి పేరుచూసి కనుక్కున్నాను. వేణు మరెవరో కాదని.

అప్పట్నుంచీ అతనంటే అదేదో చెప్పలేని అభిమానం. వాళ్ళ కుటుంబం గురించిన వివరాలు కనుక్కోవాలని చాలాసార్లు అనిపించింది. కానీ అతను బాయ్. నేనీ ఆఫీస్‌కు మేనేజర్. బాగుండదని నా కుతూహలాన్ని చంపుకున్నాను.

ఇంట్లో అమ్మకు కూడా చెప్పలేదు. చెప్తే, వేణును ఇంటికి తీసుకొచ్చేవరకూ వదలదు. ఆమెను ఆమె ఇష్టానుసారంగా ప్రవర్తించకుండా ఆపడం నావల్ల కాదు.

హైదరాబాద్‌లో బయల్దేరినప్పట్నించీ నాన్ స్టాప్‌గా మాట్లాడుతున్న కొందరు అమ్మాయిలు కూడా అలసిపోయినట్లు నిశ్శబ్దంగా కళ్ళు మూతలుపడి, కొద్దిగా తూగుతున్నారు.

ఇంతలో కర్నూల్ రావటం, వాన్ ఊరి మెయిన్ రోడ్ల ద్వారా వెళ్ళటం గమనించాను. నాతోపాటు, వేరే సూపర్‌వైజర్‌లెవరూ రాలేకపోయినా, మా ఎకౌంటెంట్ భద్రాచలం మాత్రం ఉన్నారు. ఆయన వయసుకు గౌరవమిచ్చి ఆఫీసులో అంతా ఆయన్ని,



'మాస్టర్' అని పిలుస్తారు.

మా వాన్ బస్టాండుకు దగ్గర్లో ఒక చిన్న పెళ్ళిమంటపం ముందు ఆగింది. వేణు ఇంకా కొందరు బంధువులతో కలిసి బయటికొస్తూ మా రాకను గమనించాడు. ముందుగా కిందికి దిగిన నా చేతులు రెండూ పట్టుకుంటూ, "రండి సార్" అని లోపలికి పిలుచుకెళ్ళాడు. భద్రాచలం నా వెంట పెద్ద గిఫ్ట్‌పాక్ ఒకటి పట్టుకుని నడిచారు. మా వెంట వచ్చిన మిగతా ఉద్యోగులు కూడా మాతోబాటు లోపలికి నడిచారు.

వాళ్ళందర్నీ వేణు ఒక్కొక్కరిగా పలుకరించి, హాల్లో ఒకచోట కూర్చోబెట్టాడు.

నన్ను, భద్రాచలంగార్ని మటుకు "మా ఫేమిలీ మెంబర్స్‌తో పరిచయం చేస్తాను. రండి సార్! మా అమ్మ మిమ్మల్ని చూడాలని చాలా ఎదురుచూస్తోంది. పెళ్ళికి కావలసిన డబ్బంతా, మీరే అప్పుగా ఇచ్చారని తెలిసిన ప్పట్నించీ ఆవిడ్ని పట్టలేకుండా ఉన్నాము. మీరె ప్పుడొస్తారని నిముషానికొకసారి అడుగుతోంది. చెప్పలేక ఛస్తున్నాం" అని నవ్వాడు, వేణు.

పక్కన ఉన్న చిన్న గదిలో మూసున్న తలుపులు ముందుకు తోశాడు. లోపల ఎదురు గోడకు ఆనుకుని కూర్చుని ఉన్న ముసలావిడను వెంటనే గుర్తించాను. నేనను కున్నంతకన్నా ముసలితనం ఎక్కువే వచ్చేసింది సీతమ్మగారికి. దగ్గరికెళుతూ, వేణు "అమ్మా! ఇరుగో వీరే, మా బాస్, రామకృష్ణగారు. చూడాలన్నావుగా?" అంటుండగానే, "నన్ను గుర్తుపట్టారా అమ్మా?" అని కుతూహలంగా అడిగాను. ఆవిడ చూపు తీక్షణం చేసి చూస్తూ "ఎవరూ" అన్నారు.

"నేనమ్మా రామూను..మా మాస్టారు ఏరీ?" అన్నాను నిదానంగా.

"నీలకంఠం కొడుకు కదూ బాబూ?"

'అబ్బ! ఫర్వాలేదు. త్వరగానే కనుక్కున్నారు' అనుకున్నాను.

" ఆయన చాలా మెత్తబడిపోయారు బాబూ! ఇంట్లో పడుకుని ఉన్నారు. ముహూర్తం ముగించుకుని త్వరగా ఇంటికెళ్ళాలి"

వేణు అవాక్కై ఉండిపోయాడు. భద్రాచలంగారికి ఏం జరుగుతున్నదీ అర్థం కాకుండా ఉంది.

ఆ ఒక్క క్షణం నిశ్శబ్దం! ఆ తర్వాత అంతా అల్లకల్లోలం!

అవతల రూము తలుపు తీసుకుని, వెంట ఉన్న మిగతా ఆడవాళ్ళకన్నా, కొద్దిగా ఎక్కువ అలంకరించుకుని, కొత్తగా కనిపిస్తున్న సిల్క్‌చీర కట్టుకునీ ఉన్న ఒక అమ్మాయి బయటికొచ్చింది. పెళ్ళికూతురు కాబోలు అనుకున్నాను. ఉమను నేను చూసి చాలా సంవత్సరాలే అయింది. ఆమెను చూసినా గుర్తుపట్టలేని పరిస్థితి.

ఆమె తలెత్తి ఇక్కడేం జరుగుతున్నది చూసిందో లేదో, బయట్నించీ ఎవరో పెద్దగా పిలిచారు. "వేణూ! ఇలా రా నీకు ఫోను!" అంటూ. పిలుపు వెనకే, ఒక

పెద్దాయన కూడా లోపలికొచ్చి, "వేణూ! మీ కాబోయే బావగారికి గుండెనొప్పి వచ్చిందటరా! మనం అర్జెంట్‌గా వెళ్ళాలి" అని తొందరపెట్టారు.

పరిస్థితి వెంటనే అర్థం అయింది. భద్రాచలంగారి వైపుచూసాను. ఆయన, "సర్! మనం వచ్చిన వాన్ బయటే ఉంది. అందరూ అందులో వెళ్ళొచ్చునను కుంటా!" అన్నారు బయటికి నడుస్తూ.

వేణు, అతనివెంట అతని బంధువులు ముగ్గురు, నేను, భద్రాచలంగారు, అందరూ వాన్లో హాస్పిటల్‌కు బయల్దేరాం! ఆ క్షణంలో మేమెవరూ ఉమ పరిస్థితి ఏమయి ఉంటుందో గమనించలేదు. నాకు గుర్తున్నా ధైర్యం కూడగట్టుకోలేకపోయాను.

* * *

మేం వెళ్ళేసరికి అంతా అయిపోయింది. పెళ్ళికొడుకు సుబ్బరామయ్యకి గుండె జబ్బు ముందే ఉందట. వేణు వాళ్ళకు తెలియదు. ఇంతకుముందు ఒకటి రెండుసార్లు గుండె పోటొచ్చినట్లుంది. ఇది మూడోసారనుకుంటా. అతనికి తల్లిదండ్రులు, సంతానం కూడా లేనందుకు, వేణుకు, అతని బంధువులకు, ఏం చేయాలో తోచలేదు. విషయం తెలియగానే. దేవుడు పంపినట్లుగా వేలువిడిచిన చెల్లెలు, బావగారు వచ్చేసరికి అంతా సర్దుకుంది.

మేమంతా వాన్‌లో పెళ్ళిమంటపం చేరుకున్నాం.

వేణు పరిస్థితి తలుచుకుంటే, నా గుండె తరుక్కుపోతోంది.

ఇప్పటిదాకా అయిన ఖర్చులన్నీ అయిపోయాయి. అక్క పెళ్ళి మాత్రం ఆగిపోయింది. ఇప్పుడిక ఏం చేస్తాడు? వెళ్ళి అక్కయ్యకూ, తల్లికీ ఎలా ముఖం చూపిస్తాడు?

అప్పటికప్పుడే ఏం చేయాలో నిర్ణయించుకున్నాను. నేను పాపం అంటూ చేసుంటే, నాకీ క్షణంలో, దేవుడు అందుకు పరిహారం చేసుకునే అవకాశం కలిగిస్తున్నాడనిపించింది. వాన్ దిగగానే, తల వేలాడేసుకుని నిలుచున్న వేణు దగ్గరికెళ్ళి నేనేం చేయదల్చుకున్నది చెప్పాను.

"సార్!" అన్నాడు గొంతు పెంచుతూ.

నేనేమీ జవాబివ్వకుండా వాళ్ళమ్మగారున్న గదిలోపలికి నడిచాను.

నేరుగా వెళ్ళి, ఆవిడ పాదాలకు నమస్కరించి, "అమ్మా, మీకిష్టమయితే, ఉమను నేను పెళ్ళి చేసుకుంటాను" అన్నాను. ఒక్కొక్క మాటే కూడదీసుకుంటూ.

ఆవిడ ఇంకా ఏ సమాధానం ఇవ్వకముందే. "మీకందరికీ నేను తెలుసు. మీకయితే, నేను, మా కుటుంబం ఎన్నో ఏళ్ళుగా తెలుసు. వేరే చెప్పాల్సిందేమీ లేదు. మా అమ్మ నా మాటను కాదనరు"

"......"

హాస్పిటల్ నుంచీ వార్త మా కన్నుముందే ఇక్కడికి చేరినట్లుంది. ఉమ వాళ్ళమ్మగారి ఒడిలో తలపెట్టుకుని, అసహాయంగా ఏడుస్తోంది.

నా మాటలు అర్థంఅయి తలెత్తిచూసింది.

"నేను ఉమా! చిన్నప్పుడు నీతో ఆడుకున్న రామూను. గుర్తుందనుకుంటా! నన్ను పెళ్ళి చేసుకోవటం ఇష్టమేనా?"

భద్రాచలంగారూ, మా వెంటే వచ్చి బయట్నుంచీ తొంగిచూస్తున్న మిగతా బంధువులూ అందరూ అవాక్కై చూస్తున్నారు. వాళ్ళందరి ప్రశ్నా ఒక్కటే. అదేంటో నాకు తెలుసు. "నాకేమయినా పిచ్చి పట్టిందా?"

మెల్లగా అందరికీ అర్థమయింది. అలాంటిదేం లేదు. నేను ఆలోచించి ఈ పనిచేస్తున్నానని. వాళ్ళ బంధువుల్లో ఒక పెద్దాయన ముందుకొచ్చి, మధ్యవర్తిగా వ్యవహరించడంతో, పరిస్థితి కుదుటపడింది. అనుకున్న ముహూర్తానికి ఈ పెళ్ళి అవ్వాలని నిర్ణయించారు.

భద్రాచలంగారు, గబ గబా బయటికెళ్ళారు. మిగతా మా ఆఫీస్ సహోద్యోగులకంతా ఈ వార్త చెప్పాలిగా?

* * *

ఆ రాత్రే ఆఫీస్ వాళ్ళంతా వాన్‌లో వెనుతిరిగి వెళ్ళిపోయారు.

నేను మాత్రం మూడోరోజుకు, అమ్మకుఫోన్ చేసి కార్ తెప్పించుకున్నాను. ఒకేసారి, ఉమను తీసుకుని బయల్దేరాను. ఉమ ఏదో చెప్తోంది. నేను సరిగ్గావిని సంభాషణలో పాల్గొనలేకుండా ఉన్నాను.

పెళ్ళయినప్పట్నుంచీ, వసపిట్టలా వాగుతున్న నేను హఠాత్తుగా ఎందుకు నిశ్శబ్దం అయిపోయానో, ఏ ఆలోచనలోపడ్డానో ఉమకు అర్థం కాలేదనుకుంటా. బహుశా అమ్మను ఫేస్ చేయటమెలా అని టెన్షన్ పడుతున్నానని అనుకుని ఉండొచ్చు.

అసలు మొదటిసారి కుదిరిన తన పెళ్ళిని చెడగొట్టింది నేనే అని చెప్పాలా? వద్దా? చెప్పకుండా ఎప్పటికీ దాయగలనా? ఏమయినా, జీవితమంతా కలిసి ఉండాల్సిన వాళ్ళం కదా? చెప్తే తన మనసు విరిగాక నన్ను క్షమించగలదా? ఏమో?

○



## నన్ను తిట్టకండి ప్లీజ్

హీరోయిన్‌గా అవకాశాలు తగ్గడంతో వాంప్ తరహా పాత్రల్ని కూడా పోషించడానికి రెడీ అయింది నమిత. దర్శకుడు సురేష్ కృష్ణన్ తన 50వ సినిమాగా రూపొందిస్తున్న 'ఇల్లయినన్' అనే సినిమాలో భయంకరమైన షేడ్స్ వున్న పాత్రని పోషిస్తోందిట నమిత. ఇందులో తన పాత్ర తీరు చూస్తే కచ్చితంగా తనని జనాలు తిట్టుకుంటారని నవ్వుతూ అంటోంది. అయితే తను నిజజీవితంలో అంత దుష్టురాలిని కాదన్న సంగతి అందరికీ తెలుసు కదా- అని కూడా తనని తాను సమర్థించుకుంటోంది నమిత.